ప్రజాశక్తి
ఆదివారం 25 ఆగస్టు 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నిర్లక్ష్య కంపెనీలపై

కఠిన చర్యలు తీసుకోండి



విలేకరుల సమావేశంలో సిహెచ్.నర్సింగరావు, ఓబులేసు తదితరులు

- 'ఎసెన్షియా' ఫార్మా ఘటనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం
- ప్రమాద ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టండి
- అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్
- ఫార్మా ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - అనకాపల్లి

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదానికి పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరే కారణమని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫార్మా ప్రమాదంలో గాయపడి అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పాండా, ఐఎఫ్‌టియు రాష్ట్ర సమితి సభ్యులు మల్లన్న తదితరులు శనివారం పరామర్శించారు. అనంతరం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్య తీరుతో ఫార్మా కంపెనీల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫార్మా ప్రమాద బాధితుల విషయంలో కేవలం నష్టపరిహారం ప్రకటించి తప్పుకునే ప్రయత్నం చేశారన్నారు. కంపెనీలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం, గతంలో జరిగిన ప్రమాదాల తరువాతైనా గుణపాఠాలు నేర్వకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ప్రమాద కారణాల నివేదికలను ఇంతవరకు బయట పెట్టకపోవడం శోచనీయమన్నారు. తాజా ప్రమాదంపై ముఖ్యమంత్రి, హోంమంత్రి, పార్లమెంటు సభ్యులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీలు ఆధునిక జైళ్లుగా మారాయన్నారు. దేశంలోని ధనవంతుల్లో ఫార్మా కంపెనీల వారే మిగతా 2లో..

ఫార్మా ప్రమాద బాధితుల పట్ల..

ఇలాగేనా వ్యవహరించేది ?

- క్షతగాత్రులను బస్సుల్లో తరలిస్తారా .. సరైన అంబులెన్స్‌లే లేవా ?
- ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయండి
- జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాల్లో చైర్‌పర్సన్ సుభద్ర



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాద ఘటనలో బాధితులకు సరైన అంబులెన్సు సదుపాయం లేక బస్సుల్లో తరలించడం పట్ల ఆమె అసహనం వ్యక్తం చేశారు. పరిశ్రమలు ఉన్నచోట్ల ప్రభుత్వం, యాజమాన్యంతో మాట్లాడి ఆసుపత్రులు, అంబులెన్సుల సదుపాయం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. కోటవురట్ల మండలం కైలాసపురం సంఘటన, ఎసెన్షియా ఫార్మా ఘటన సమయంలో బాధితుల పట్ల వైద్యుల చూపిన తీరు ప్రశంసనీయమని ఆమె కితాబిచ్చారు. ఆమె అధ్యక్షతన జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగాయి. గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. సమావేశాల్లో భాగంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు వేయగా ఆయా శాఖల అధికారులు బదులిచ్చారు. ఇప్పటి మిగతా 2లో..

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

▶ వార్త 4లో..

కుసులవాడలో మైనింగ్‌ను రద్దుచేయాలి

▶ వార్త 4లో..

ప్రమాదాలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

▶ వార్త 5లో..

30న విశాఖకు రాజ్యసభ సభ్యుల బృందం

ప్రజలు, సంస్థల నుంచి వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 30న సాయంత్రం విశాఖ పోర్టుకు రాజ్యసభ సభ్యుల బృందం రానుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లలో వైజాగ్ పోర్టు ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. 30న సాయంత్రం నోవటల్‌కు నేరుగా బృంద సభ్యులు చేరుకోనున్నారు. అక్కడ ఆ రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలను పోర్టు అధికారులు వీరి కోసం ఏర్పాటు చేస్తున్నారు. ఈ కమిటీ పిటిషన్స్‌ను స్వీకరించేందుకు విచ్చేస్తోంది. 31న పూర్తిస్థాయిలో కమిటీ సభ్యులు పర్యటించనున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఆర్‌ఐఎన్‌ఎల్, హెచ్‌పిసిఎల్, షిప్‌యార్డు తదితర చోట్లకు వెళ్లే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అలాగే మెడ్ టెక్ జోన్‌కు కూడా బృంద సభ్యులు వెళ్లనున్నారు. ఈ కమిటీకి ఒడిశా బిజెడి ఎంపీ సుజిత్ కుమార్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఆయనతో కలిపి ఎనిమిది మంది పర్యటనలో పాల్గొనున్నారు. కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ నుంచి ఇద్దరు సభ్యులు ఈ పిటిషన్స్ కమిటీలో ఉంటారు. వీరంతా ప్రజల నుంచి లేదంటే ప్రభుత్వ రంగ సంస్థలు, మెడ్‌టెక్ వంటి సంస్థల నుంచి ఫిర్యాదులను 31వ తేదీన స్వీకరించనున్నారు.

26న ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 26న శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా ప్రభుత్వ సెలవు అయినందున జివిఎంసి ప్రధాన కార్యాలయంలోనూ, అన్ని జోనల్ కార్యాలయాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అన్ని పరిశ్రమల్లో వారం రోజుల్లో సేఫ్టీ ఆడిట్

అధికారులకు విశాఖ కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్మికులు, ఉద్యోగుల భద్రతకు, రక్షణకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ పరిశ్రమలను నిర్వహించాలని, పని చేసే చోట వారికి అన్ని రకాల వసతులూ కల్పించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. వారం రోజుల్లోగా జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని, లోటుపాట్లను గుర్తించి సరి చేయాలని సూచించారు. సెప్టెంబర్ 30వ తేదీలోగా అన్ని చోట్లా మాక్ డ్రిల్స్ కండక్ట్ చేయాలని, ప్రమాదాలపై కార్మికులకు, సమీప నివాసితులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి కంపెనీ పరిసరాల్లో అలారం సిస్టం తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన ఫార్మా ప్రమాద ఘటనల నేపథ్యంలో జిల్లాలోని 57 పరిశ్రమల నిర్వాహకులతో జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలులో పోలీస్ కమిషనర్, జాయింట్ కలెక్టర్, జివిఎంసి కమిషనర్, ఇతర అధికారులతో కలిసి శనివారం సాయంత్రం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు ప్రశాంత వాతావరణంలో.. ధైర్యంగా ఉద్యోగం చేసుకునేలా నిర్వాహకులు, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పని చేసే చోట వారికి అన్ని రకాల వసతులూ కల్పించాలని, అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ప్రథమ చికిత్స చేయడానికి కిట్లను అందుబాటులో ఉంచాలని, పారామెడికల్ సిబ్బందిని నియమించుకోవాలని చెప్పారు. సేఫ్టీ ప్రోటోకాల్ పాటిస్తూ నైపుణ్యం కలిగిన ఒక ఇన్‌ఛార్జిని కూడా నియమించుకోవాలని సూచించారు. ప్రమాద ఘటనలు జరిగినప్పుడు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కఠిన చర్యలు తీసుకోండి

ఎక్కువ మంది ఉన్నారు. దేశ, విదేశాల్లో వద్దన్న ఫార్మా కంపెనీలను ఇక్కడ నెలకొల్పుతుండడంతో ఇక్కడ ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. విషతుల్య రసాయన పరిశ్రమల వల్ల మత్స్యకారుల కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయన్నారు. తక్షణమే అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ ఆధీనంలో ఫార్మా కంపెనీలు ఉండాలని, జరిగిన ప్రమాదంపై తక్షణమే జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో ఈ నెల 28న విజయవాడలోని కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి కొండలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, ప్రజా సంఘాల నాయకులు ఎం.అప్పలరాజు, కె.త్రినాథ్, పెంటకోట సత్యనారాయణ, రాజు, ఫణీంద్ర పాల్గొన్నారు. అలాగే ఆసుపత్రిలో ఫార్మా ప్రమాద బాధితులను పరామర్శించిన వారిలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, ఎస్ఎఫ్ఐ నాయకులు చలపతి, తదితరులు ఉన్నారు.

ఇలాగేనా వ్యవహరించేది ?

వరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా జెడ్పి ఛైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ గిరిజన ప్రాంతంలో చేయూత పథకం కొందరికి అందలేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. అలాగే గృహ నిర్మాణాలకు చెందిన బిల్లులు చెల్లించలేదని, ఇదివరకే దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొత్త గృహాలు మంజూరు కాలేదని కూడా ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని మంజూరు చేసి లబ్ధిదారులకు అందజేయాలని సంబంధిత అధికారులను కోరారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన గృహ పథకాలు కొనసాగుతాయని, పెండింగ్‌లో ఉన్న గృహ లబ్ధిదారులు ఇకెవైసి తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాల్సి ఉందని అధికారులు ఛైర్‌పర్సన్‌కు వివరించారు. గ్రామ సభల్లో తీర్మానం చేసిన పనులపై ఆరా తీసిన ఆమె జెడ్‌పిటిసిలకు సమాచారం ఇవ్వాలన్నారు. దీనికి అధికారులు బదులిస్తూ ప్రతి గ్రామ సభలో తీర్మానం చేసిన పనులు తప్పక మంజూరవుతాయని, అలాగే గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులకు సమాచారం అందజేయడం జరుగుతుందని అన్నారు. అసంపూర్తిగా వున్న అంగన్వాడీ భవనాలు పూర్తయ్యేలా చూడాలని, మరమ్మతులు చేపట్టవలసిన భవనాలను నిర్లక్ష్యం చేయరాదని సంబంధిత అధికారులను సుభద్ర ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో సిల్వర్ ఓక్‌తో పాటు వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని, కాఫీతో పాటు జీడి, మిరియాల పంటలు పండించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో 5వ స్థాయీ సంఘం ఛైర్‌పర్సన్ ఈర్లె అనూరాధ, జిల్లా పరిషత్ సిఇఒ డి.సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జెడ్‌పిటిసి సభ్యులు పాల్గొన్నారు.

కాఫీ తోటలకు గతంలో మాదిరి రూ.48 వేలు ఇవ్వాలి

- సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు



మాట్లాడుతున్న గంగరాజు

ఉపాధి హామీ చట్టం నిధుల్లో కాఫీ తోటలకు గతంలో మాదిరి రూ.48 వేలు ఇవ్వాలని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు డిమాండ్ చేశారు. జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాల్లో భాగంగా ఆయన రెండు, నాలుగు స్థాయీ సంఘాల సమావేశాల్లో మాట్లాడుతూ కాఫీ తోటల పెంపకానికి ఉపాధి హామీ నిధులు ఇవ్వకపోవడం, వాణిజ్య పంటలకు నిధులను ప్రాధాన్యతారీతిలో కేటాయింపు చేయకపోవడం వంటి కారణాలతో యువత గంజాయి పెంపకం వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. దీనిని నివారించాలంటే ఉపాధి నిధులు కాఫీ తోటల పెంపకానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. టెక్నికల్ సమస్యలు చెప్పి సామాజిక పింఛన్లు నిలిపివేయడం తగదన్నారు. కాఫీ తోటలకు ఎన్ఆర్ఇజిఎస్ నిధులు మంజూరు చేయాలని కోరారు. గతంలో ఉపాధి హామీ చట్టంలో ఉన్న ఆ నిధులను 2020లో తొలగించారన్నారు. నాడు ఒక ఎకరం కాఫీ తోటకు రూ.48 వేలును విడతల వారీగా రైతులకు చెల్లించిన విషయాన్ని గుర్తుచేశారు. కాఫీ తోటలకు ఉపాధి హామీ చట్టం లింకును ఎత్తివేయడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. విశాఖపట్నం కెజిహెచ్‌లో రోగుల నుంచి కిందిస్థాయి ఉద్యోగులు, డ్రైవర్లు లంచం అడగడం మానుకోవాలని తెలిపారు. అనంతగిరి మండలం, ఇతర ప్రాంతాల నుంచి, విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అత్యవసర కేసులను కెజిహెచ్‌కు తరలించకుండా విజయనగరం రిఫర్ చేస్తున్నారన్నారు. 108 అంబులెన్స్ ద్వారా కెజిహెచ్‌కు రిఫర్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్ని పరిశ్రమల్లో వారం రోజుల్లో సేఫ్టీ ఆడిట్

సమాచార మార్పిడి, ప్రమాద నివారణ సూచనలను పంచుకోవడానికి వీలుగా ఒక పోర్టల్ క్రియేట్ చేస్తామని, అందరికీ లాగిన్ ఐడిలు ఇస్తామని తెలిపారు. జిల్లాలోని 57 పారిశ్రామిక యూనిట్లలో సంబంధిత విభాగాల అధికారులు తరచూ తనిఖీలు చేపట్టాలని, లోపాలుంటే తక్షణమే సరిదిద్దేలా యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వాలని చెప్పారు. త్వరలోనే జాయింట్ తనిఖీ బృందాన్ని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో సిపి శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫక్కీరప్ప, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణపతి, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, పలువురు పరిశ్రమల నిర్వాహకులు పాల్గొన్నారు.

మృతులకు సంతాపం ప్రకటించిన యంత్రాంగం

ఇటీవల జరిగిన ఫార్మా ఘటనలో 17 మంది చనిపోవడం విచారకరమని, వారి కుటుంబాల పరిస్థితి ఇప్పుడు దయనీయంగా ఉందని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. వారి మృతికి సంతాపం ప్రకటిస్తూ ఈ క్రమంలో అధికారులంతా లేచి నిల్చొని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

అపోలో నుంచి రూ.21.60 లక్షల నష్ట పరిహారం సాధించాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రోగికి నిర్లక్ష్యంగా వైద్యం చేసినందుకుగాను విశాఖపట్నం అపోలో ఆసుపత్రిపై రూ.21.60 లక్షల నష్ట పరిహారం సాధించామని సుప్రీంకోర్టు న్యాయవాది, అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ (ఆశ్రా) వ్యవస్థాపకులు అబీబ్ సుల్తాన్ అలీ తెలిపారు. అపోలోలో వైద్యుల నిర్లక్ష్యంపై శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య రంగం నిర్లక్ష్యం మీద ఒక వినియోగదారుడు సాధించిన గొప్ప విజయంగా తాజా ఘటనను ఉదహరించారు. ఆశ్రా సంస్థ దేశంలోనే అతి పెద్ద వినియోగదారుల పరిరక్షణ సంస్థ అని పేర్కొన్నారు. తాము అపోలో ఆసుపత్రి నుంచి రూ.21.60 లక్షల నష్ట పరిహారం ఎలా సాధించినదీ వివరించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు పెరగాలన్నారు. సమావేశంలో ఆశ్రా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది తోట శత్రుఘ్నుడు. సభ్యులు మహ్మద్ ఇక్బాల్జీ, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

ఎవరి మెప్పు కోసం అధికారులపై వేధింపులు

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో కన్వీనర్ అయోధ్యరామ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎవరి మెప్పు పొందడం కోసం ఉక్కు అధికారులపై వేధింపులకు పాల్పడుతున్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ప్రశ్నించారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న ఇడి ఒఎస్ ఇన్‌ఛార్జిని మార్చారని తెలిపారు. ఆయనకు కనీసం రూము కూడా అలాట్ చేయకుండా వేధింపులకు దిగారని పేర్కొన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్‌లో పనిచేసే మరొక సిన్సియర్ అధికారి నాగ్‌ను, మరొక విభాగంలో పనిచేస్తున్న కెవి.రావును ఇష్టానుసారంగా బదిలీ చేశారని తెలిపారు. మరోపక్క 199 మంది ఇంజినీరింగ్ విభాగం ఇన్చార్జిలకు కాంట్రాక్టు లేబర్ అటెండెన్స్ లింకు పెట్టి రాత్రికి రాత్రి షోకాజ్ నోటీసులు అందజేశారన్నారు. ఇదంతా ఇక్కడ ఉన్న స్టీల్ సిఎమ్‌డి చేస్తున్నారా ? లేక ఢిల్లీలో ఉన్న మంత్రి ద్వారా ఆదేశాలు అందుతున్నాయా ? అన్నది తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్లాంట్‌లో ఉత్పత్తి, ముడి సరుకులు, ఉద్యోగుల జీతాలు లేక అలమటిస్తూ ఉంటే ప్లాంట్‌లో భయానక వాతావరణం సృష్టించి భయభ్రాంతులకు గురి చేయాలనుకోవడం ఎంత వరకూ సమంజసమన్నారు.

ఆకట్టుకున్న సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ వస్త్ర ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశీ కళా ఆథెంటిక్ లూమ్ ఆధ్వర్యంలో వైజాగ్ బీచ్ రోడ్డులోని గేట్ వే హోటల్‌లో సిల్క్ ఇండియా హండ్లూమ్ వస్త్ర ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శన ఈ నెల 29 వరకు ఉదయం 10:30 నుండి రాత్రి 9:30 వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు సతీష్ కుమార్ మాట్లాడుతూ కృష్ణాష్టమి, వినాయక చవితి వంటి పండగలు, వెడ్డింగ్ సీజన్ సందర్భంలో కొత్త కలెక్షన్స్, ఎక్కువ వెరైటీస్‌తో వైజాగ్ ప్రజల ముందుకు వచ్చామన్నారు. ఈ ప్రదర్శనలో చేనేత కళాకారుల నైపుణ్యం, నేతన్నల శ్రమ కనిపిస్తుందని అన్నారు. వంద శాతం ప్యూర్ సిల్క్, జాంధని, బెనారస్, బాగల్పూరి సిల్క్, లెనిన్ కాటన్, పోచంపల్లి, మైసూర్ సిల్క్, ధర్మవరం, డ్రెస్ మెటీరియల్స్, డ్రెస్సెస్ వంటి మరిన్ని రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సుమారు 20 రాష్ట్రాల నుంచి 50కిపైగా చేనేతకారులు పాల్గొన్నారన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని చేనేత కార్మికులను ప్రోత్సహించాలని కోరారు.

రేంజ్ ఆఫీసర్‌ను బదిలీ చేయాలని వినతి

ప్రజాశక్తి - చింతూరు : దీర్ఘకాలంగా పని చేస్తున్న కూనవరం రేంజ్ ఆఫీసర్‌ను వెంటనే బదిలీ చేయాలని టిడిపి కూటమి నాయకులు శనివారం చింతూరు డిఎఫ్ఒకు వినతి పత్రం అందించారు. రేంజ్ ఆఫీసర్ గిరిజనులను తీవ్ర ఇబ్బంది పెడుతున్నారని అందులో పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు పాయం వెంకయ్య, రమణారెడ్డి, ఇల్లా చిన్నారెడ్డి, యస్‌డి.అసిఫ్, మడివి రాజు తదితరులు పాల్గొన్నారు.

27న సిఆర్‌టిలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-రంపచోడవరం : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలలు, జిపిఎస్ పాఠశాలల్లో సిఆర్‌టిలుగా పనిచేస్తున్న అర్హత కలిగిన సిఆర్‌టిలకు ఈ నెల 27న ఇంటర్వ్యూలు, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పథక నిర్వహణాధికారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రంపచోడవరం ఐటిడిఎ సమావేశ మందిరంలో 27న ఉదయం 8 గంటలకు హాజరు కావాలని కోరారు.

IN THE HON'BLE COURT OF THE IXTH ADDL. DIST. JUDGE CUM MACTAT CHODAVARAM.
MOP No. 339/2022

Between:
Elusuri Pydiraju . . . Petitioner
And:
Md. Saud Ansari And two others. ...Respondents

NOTICE

Respondent No.1.
Md. Saud Ansari, S/o Sarif Miyam, 25 years, caste by muslim R/o Home No. 422, W. No 8 Subhash Chowk, Akaltara, Janjgir Champa CG Driver of Lorry Regd. No. OD 16D 6722.

Please take notice of the above MOP 339/2022 filed by the petitioner against the respondents 1 to 3 claiming compensation against his grievous injuries received due to accident.

You are hereby summoned by order through publication to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the said claim on the **9th day of September 2024 at 10.30 hours,** the matter coming for your appearance. Failing which the matter will be heard and determined in your absence

(By order of the Honorable Court)

V.PRABHAKARARAO MISRO
M.A., PM & IR., LL.M.,
Advocate for the petitioner
Gajuwaka Phone: 8008289709

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT GAJUWAKA
E. P. 38/2023 in OS: 236/2014.

Between:
Sri. Boddeda Gangadhar **...Petitioner/Dhr**
And:
Mr. Avanur Sankunny Gopala Krishnan **...Respondent/J.dr**

NOTICE

To,
Sole JDr ;
Mr.AVANUR SANKUNNY GOPALA KRISHNAN, S/o. Shankara Shankunny, Aged 55 Years, Deputy General Manager (Electrical), Employee No: 119436 Dept-Elect 3600, Visakha Steel Plant, VISAKHAPATNAM (AP)
Res : - Q. No: VII/303 B, Sector-7, Director's Bunglows, Ukkunagaram, Visakhapatnam.

Please take SALE notice that the above numbered EP No; 38 of 2023 in OS: 236/2014 filed by the Petitioner/D. Hr, against you for the recovery of the Execution Petition amount under order XXI RULE 64 to 66 CPC, and the Honourable court was issued a sale notice by way of paper publication and the matter stands posted to **13-09-2024** i.e. on Friday for your appearance either in person or through an Advocate at **10.30 am** failing which the matter will heard and determined in your absence.

(By order of the Honourable SENIOR CIVIL JUDGE COURT AT GAJUWAKA)

Advocates for the Petitioner/D.Hr
BATCHU SRINIVASA RAO,
Mrs B. JAHNAVI PRAVALLIKA
Mrs B. KANJITHA LAKSHMI
Mrs. J (A) JYOTHIUDHAY
Sriharipuram, Visakhapatnam-011.
Phone: 9393120901. 7095439968

IN THE COURT OF THE IInd ADDITIONAL DISTRICT & SESSIONS JUDGE (MACT) AMALAPURAM, EAST GODAVARI DISTRICT
M.V.O.P.NO. 50/2024

Between:
Kandregula Pentayya ***...Petitioner***
AND
N.Chandra Sekhar and others ***....Respondents***

Notice to Respondent:
R2. Polisetty Venkata Suryanarayana Murthy, S/o Venkata Ramana Rao, Age 50 years, D. No: 31-33-46/A-1, Neelu Heights Apartments A-1, Daba gardens, Visakhapatnam, Pin: 530 020, (Owner of Bolero Car bearing Regd. No: AP 39 UK 4369)

In the above M.V.O.P N.O. 50 /2024 the 2nd respondent hearing date stand posted to **05-09-2024 at 10.30 AM** before the 2nd additional district and sessions Judge Amalapuram, E. G. Dt., Hence take notice that if you fail to appear before the said court on that day, the matter will be decided exparty in your absence.

Hearing date: 05-09-2024

N.RAJASEKHAR
Advocate, Amalapuram, E.G.Dt., A.P
Cell: 9849193665

Amalapuram
Dt.02-08-2024

IN THE HONOURABLE COURT OF THE XII ADDL.DISTRICT JUDGE AT VISAKHAPATNAM
IA 736/2023 IN AS 52/2020

Between:
The Mandal Thasildar, Bheemunipatnam mandal, Visakhapatnam ... Petitioner
And: N.Kanthamma and 6 Others ... Respondents

I.A.NOTICE

To
R-3: Suthi Appa Rao, S/o Chinnayya, Hindu. Aged about 40 years, resident of Pathapalem, Nagamayyapalem (post), Chittivalasa (SO), Bheemunipatnam Mandal, Visakhapatnam District.-531162
R-4: Vempada Bangaru Reddy, S/o late Suthanna, Hindu, aged about 48 years, resident of Chittinagar Village, Chippada (post), Chittivalasa (SO), Bheemunipatnam Mandal, Visakhapatnam District. -531162
R-5: Koyya Ramunaidu, S/o late Latchanna, Hindu, aged about 50 years, resident of Mulkudhu Village, Chittivalasa (SO), Bheemunipatnam Mandal, Visakhapatnam District.
R-6: Koyya Appala Reddy, S/o late Latchanna, Hindu, aged 47 years, Resciding at Mulkudhu Village, Chittivalasa (SO), Bheemunipatnam Visakhapatnam District.
R-7: Koyya Appalasuri, S/o late suri Narisamma,Hindu, aged about 25 years, resident of Mulkudhu Village, Chittivalasa (SO), Bheemunipatnam Mandal, Visakhapatnam District.

Please take notice that the above IA 736/2023 in AS 52/2020, filed to reopen the above appeal against respondents No. 3 to 7, is posted for your appearance on **16-09-2024** at about **10:30 A.M.** before the Honourable Court, either in person or through your advocate. Failure to appear will result in the matter being decided ex parte.

(By Court order)

P.V.R.PRABHAT Government Pleader
District court, Visakhapatnam

IN THE HONOURABLE COURT OF THE II ADDDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.P.50/2022

Between:
Sri Padala Vasanth Kumar Reddy, S/o. Srinivasa Reddy, aged 32 years, D.No. 2-13, Machavaram, Rayavaram Mandal, Dr. B.R. Ambedkar Konaseema District. ...Petitioner
And:
1. Sri Putcha Koteswara Rao, S/o Rami Reddy, Aged about 38 years, D.No. 57-27-293, Siddardha Nagar, I.T.I. Junction, Kancharapalem, Visakhapatnam District.
2. Sri. Kosuri Rama Rao, S/o. Appanna, Aged 63 years, D.No.44-34-26/24, Sai Tirumala Plaza-1, Nandagirinagar, Visakhapatnam District-16 . . . Respondents

NOTICE

Please take notice that the Honourable Court was pleased to order notice to you in the above matter through this publication as the above petitioner filed the above insolvency petition to declare as you both are insolvents, Therefore both are hereby called upon to appear before this Honourable Court on **Dt.11- 09-2024 at 10.30 A.M.,** personally or through an Advocate. If you fail to appear before this Honourable Court on that day the matter will be heard in your absence and necessary orders will be passed against you both.

N.S.V.REDDY
ADVOCATE, VENUMADHAVI VILLA,
D.NO.49-36-47, N.G.G.O'S COLONY,
AKKAYYAPALEM,
VISAKHAPATNAM-530016,
PH. No. 9393102036

అద్దె భవనంలో ఎఎంసి కార్యాలయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : నియోజకవర్గ కేంద్రమైన భీమిలిలో ఏళ్ల క్రితం నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ భవనం కొన్నేళ్ల క్రితమే శిథిలావస్థకు చేరడంతో సంబంధిత కార్యాలయాన్ని గతేడాది జూన్‌లో జివిఎంసి మూడో వార్డు పరిధి పట్టణ ఆరోగ్య కేంద్రానికి కొద్ది దూరంలో ఉన్న ఓ అద్దె భవనంలోకి మార్చారు. నెలకు రూ.10 వేలు అద్దె చెల్లిస్తున్నారు. ఉద్యోగులు, సిబ్బంది, ఎఎంసి పాలకవర్గం విజ్ఞప్తి మేరకు ఎట్టకేలకు 2021 డిసెంబర్ 21న అప్పటి వైసిపి స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శిథిల భవనం ప్రాంగణంలోనే రూ.50 లక్షలతో కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి కాంట్రాక్టర్ ముందుకు రాక పోవడంతో నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది. 2022 ఏప్రిల్ 8న మరలా ఇదే భవన నిర్మాణానికి అప్పటి ఎఎంసి చైర్మన్ శంకుస్థాపన చేశారు. అయినప్పటికీ భవన నిర్మాణంలో పురోగతి లేదు. సంబంధిత కాంట్రాక్టర్‌కు ఇప్పటి వరకూ కేవలం రూ.14 లక్షలు మాత్రమే గత ప్రభుత్వం చెల్లించినట్లు సమాచారం. ప్రస్తుతం కార్యాలయ భవనం స్లాబ్ స్థాయిలో ఉంది.

కొత్త ప్రభుత్వంలోనైనా నిర్మాణం పూర్తయ్యేనా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వంలోనైనా ఎఎంసి కార్యాలయ భవన నిర్మాణం పూర్తవుతుందన్న ఆశా భావం ఉద్యోగులు, సిబ్బందిలో నెలకొంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ తన ఆదాయాన్ని ఏటా పెంచుకుంటూ వస్తున్నా సరే సరిపడా సౌకర్యాలతో సొంత భవనాన్ని సమకూర్చుకోలేని పరిస్థితి నెలకొనడం శోచనీయం. ఉద్యోగులు, సిబ్బంది సమిష్టి కృషితో ఏటా మార్కెట్ కమిటీ ద్వారా ప్రభుత్వానికి గణనీయంగా ఆదాయం తెచ్చి పెడుతున్నారు. చెక్ పోస్టులు, రొయ్యల పరిశ్రమలు, రైస్ మిల్లులు, ప్లేఉడ్ పరిశ్రమలు ద్వారా ఎఎంసికి ఆదాయం వస్తోంది.

1976 నవంబర్ 20న వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇక్కడ ఆవిర్భవించింది. 1997 మార్చి 2న వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ భవనాన్ని అప్పటి మార్కెటింగ్, వెనుకబడిన తరగతుల శాఖా మంత్రి ఎ.ఎల్లారెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఉన్న భవనం కొన్నేళ్ల క్రితమే శిథిలావస్థకు చేరింది.

▸▸కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లింపులో జాప్యంతో నిలిచిన కొత్త భవనం పనులు

▸▸కొత్త ప్రభుత్వంలోనైనా నిర్మాణం పూర్తయ్యేనా..



సగంలో నిలిచిన భవనం ఇదే...



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మల్లికార్జున్

సాంకేతిక రంగంలో నైపుణ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నైపుణ్యం పెంచుకోవాలని ఇంజినీరింగ్ విద్యార్థులకు బెంగళూర్ బిపిఎం లేబొరేటరీస్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్ సూచించారు. 'తయారీ రంగంలో హరిత విప్లవం అవకాశాలు, సవాళ్లు' అనే అంశంపై స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఉద్దేశించి డాక్టర్ మల్లికార్జున్ మాట్లాడుతూ, ఉత్పాదక రంగంలో వస్తున్న మార్పులను వివరించారు. గ్రీన్ టెక్నాలజీల పరివర్తన సామర్థ్యం, పర్యావరణ సమస్యలను విపులీకరించారు. ఏదైనా రంగంలో దీర్ఘకాలిక స్థిరత్వం సాధించేందుకు పర్యావరణ అనుకూల ప్రక్రియ ఎలా దోహదపడుతుందనేది వివరించారు. శక్తి, సమర్థవంతమైన యంత్రాలు, వ్యర్థాలను తగ్గించే పద్ధతులు, స్థిరమైన మెటీరియల్ సోర్సింగ్ వంటి ఆవిష్కరణలు పరిశ్రమ ల్యాండ్ స్కేప్‌ను ఎలా పునర్నిర్మించవచ్చో వివరించారు. గ్రీన్ ప్రాక్టీసుల ద్వారా వ్యాపార రంగంలో పోటీతత్వాన్ని ఎలా పెంపొందించవచ్చు, నిర్వహణా వ్యయం ఎలా తగ్గించుకోవచ్చునేది వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆ హబ్‌పై అసత్య ప్రచారాలను నమ్మొద్దు'

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఏర్పాటై అతితక్కువ కాలంలో దేశంలోని ఇంక్యుబేషన్, స్టార్టప్ కేంద్రాలకు దీటుగా అత్యుత్తమ ప్రగతి సాధిస్తున్న ఏయూ ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్ (ఆ హబ్)పై కొంతమంది ఉద్దేశపూర్వకంగా అసత్యాలను ప్రచారం చేస్తున్నారని, వీటిని ఎంతమాత్రం విశ్వసించవద్దని ఆ హబ్ సిఇఒ రవి ఈశ్వరప్ప తెలిపారు. ఆ హబ్ కేంద్రంగా పనిచేస్తున్న స్టార్టప్ సంస్థలను ఖాళీ చేసి వెళ్లాలని చెప్పినట్లుగా కొంతమంది ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో ఈ వివరణ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇటువంటి నిరాధార, అసత్య ఆరోపణలను విశ్వసించవద్దని సూచించారు. ఏయూ ఆ హబ్ నుంచి ఎవ్వరిని వెళ్లమని తాము చెప్పలేదని పేర్కొన్నారు.

తాను ఆంధ్రవిశ్వవిద్యాలయం పాలకులతో సమన్వయం చేస్తూ దేశంలోని అతిపెద్ద మల్టీడిసిప్లినరీ ఇంక్యుబేషన్ ఎకోసిస్టంగా ఆ హబ్‌ను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. టెక్ ఇంక్యుబేషన్‌తో పాటు బయోటెక్, ఫార్మా, మెరైన్, ఫుడ్, జినోమిక్స్, ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్, విమెన్, గ్రామీణ తదితర రంగాలలో స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో ఇంక్యుబేషన్ రంగంలో అత్యుత్తమ స్థానాన్ని ఆ హబ్ సాధించిందని తెలిపారు. దేశంలోని విశ్వవిద్యాలయాలు కలిగివున్న అతిపెద్ద ఇంక్యుబేషన్ వ్యవస్థల్లో ఒకటిగా ఆ హబ్ ఉందన్నారు. ఆ హబ్ తన సేవలను మారిషస్, శ్రీలంకలో ప్రారంభించిందని, త్వరలో హైదరాబాద్‌లో సైతం సేవలను ప్రారంభిస్తుందని తెలిపారు. ఏయూ ఇంక్యుబేషన్ కేంద్రం రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంలో, నూతన ఆవిష్కరణలు జరపడం, సంస్థలను స్థాపించడంలో, జిడిపి వృద్ధికి ఎంతో దోహదపడుతోందని పేర్కొన్నారు.

రైల్వే అధికారులతో ఎంపీ సమీక్ష



రైల్వే అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో శనివారం విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎమ్.శ్రీభరత్, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి రైల్వేకు సంబంధించిన వివిధ అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం విశాఖపట్నం పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులు, రైల్వే లైన్ల అభివృద్ధి, కొత్త రైళ్ల ప్రతిపాదనలు తదితర ముఖ్యమైన అంశాలపై చర్చించారు. అమృత్ భారత్ స్కీం కింద విశాఖపట్నం, సింహాచలం, కొత్తవలస స్టేషన్లకు మంజూరైన నిధులు, వాటి పనుల పురోగతిని సమీక్షించిన ఎమ్.శ్రీభరత్ ఈ ప్రాజెక్టులు ప్రాంతీయ రవాణా మెరుగుపరచడంలో కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. విశాఖపట్నంలోని పోర్టులు, స్టీల్‌ప్లాంట్, ఇతర పరిశ్రమలు రైల్వే మార్గాల ద్వారా భారీగా రవాణా చేస్తున్న నేపథ్యంలో ప్రత్యేక లైన్ల ఏర్పాటుకు, రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన వివరాలను అధికారులతో చర్చించారు. దువ్వాడ స్టేషన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్టాప్ ఇవ్వాలనే ప్రతిపాదనను కూడా అధికారుల ముందుంచారు.

విశాఖపట్నం-బెంగళూరు మధ్య ప్రత్యేక రైలును వారంలో మూడు రోజులు నడపాలని, వివిధ వర్గాల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు వీలైనంత త్వరగా ఈ సర్వీసును ప్రారంభించాలని కోరారు. ఇది రెండు నగరాల మధ్య రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరచడమే కాకుండా, ఆర్థిక, వ్యాపార సంబంధాలను కూడా బలపరుస్తుందని ఎంపీ పేర్కొన్నారు.

విశాఖపట్నం రైల్వే జోన్‌పై పలు అంశాలను చర్చించారు. రైల్వే జోన్‌కు సంబంధించిన పనులు, కేటాయించిన నిధులు, భూమి కేటాయింపు తదితర విషయాలను సమీక్షించారు. రానున్న రోజుల్లో జోన్ అభివృద్ధి పనుల పురోగతిపై మరింత స్పష్టత ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

గాజువాకలో రైల్వే కు సంబంధించిన పనుల గురించి చర్చించారు. తుంగ్లాం భూ సమస్య, వడ్లపూడి వద్ద రైల్వే డ్రైయినేజీ సమస్య, సింహాచలం, మర్రిపాలెం, గోపాలపట్నం, కంచరపాలెం ప్రాంతాల్లో రైల్వేకు సంబంధించిన పలు అంశాలను కూడా సమావేశంలో చర్చించారు. సమీక్షా సమావేశంలో గాజువాక ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విశాఖపట్నం పార్లమెంటరీ అధ్యక్షులు గండి బాబ్జి, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, డివిజన్ రీజినల్ మేనేజర్ సౌరభ్‌ప్రసాద్, డివిజనల్ ఇంజినీర్ జగదీశ్వరరావు, డివిజన్ ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్, ఎలక్ట్రిక్ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జి సునీల్ పాల్గొన్నారు.

పల్లికొండ గెడ్డపై లోలెవెల్ కాజ్‌వే నిర్మించరూ...

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని భాందేవుపురం గ్రామ పంచాయతీలో ఉన్న పల్లికొండ గెడ్డపై లో లెవెల్ కాజ్‌వేను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మద్ది నుంచి భాందేవుపురం మీదుగా అలమండ సంతకు పోవు రోడ్డు మార్గంలో కాజ్‌వే లేకపోవడంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. లో లెవెల్ కాజ్‌వే నిర్మాణం చేయాలని మాజీ ఎమ్మెల్యేకు గతంలో గ్రామానికి చెందిన ఎంపిటిసి సభ్యులు బోని సావిత్రి మూడు సార్లు ఫిర్యాదుచేశారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే స్పందించి ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడి పనులు చేపట్టాలని ఆదేశించినా రెండేళ్ల నుంచి కాజ్‌వే నిర్మాణంపై ఆ శాఖ అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.

చినుకు పడితే బురద

కొండకు అనుకొని గ్రామం ఉండటంతో వర్షపు నీరు జోరుగా ప్రవహిస్తోంది. కొండ, తోటల వల్ల నీరు బురదగా వచ్చి నిల్వ చేరుతోంది. దీనికి సమీపంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. విద్యార్థులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆ శాఖ అధికారులను వివరణ కోరగా కాజ్‌వే నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని చెబుతున్నారు. ఏడాదిగా ఇదే మాట చెబుతున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

కొండ ఆక్రమణపై అధికారుల పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ దబ్బంద గ్రామ పరిధి సర్వేనెంబర్ 56 లో 2.16 ఎకరాల సెంట్లు ప్రభుత్వ కొండ పోరంబోకు స్థలాన్ని కొంతమంది కబ్జా చేసి జెసిబితో చదును చేస్తున్నారని ప్రజాశక్తిలో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. స్థానిక తహశీల్దార్ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు గ్రామ రెవెన్యూ అధికారి ప్రవళిక సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా ఆక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

27 నుంచి విద్యార్థులకు పరీక్షలు

ప్రజాశక్తి-ఆరిలోవ : అన్ని యాజమాన్య పాఠశాలల్లోనూ ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1 పరీక్షలు ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ ఆదేశించారు. డిసిఇబి ద్వారా ప్రశ్నాపత్రాలు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ పరీక్షకు గంట ముందుగా ప్రశ్నా పత్రాలు పాఠశాలలకు అందిస్తామని వివరించారు. ఈ ప్రశ్నా పత్రాలను బహిర్గతపరిచినా, సామాజిక మాధ్యమాలలో పెట్టినా చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఎయులో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని విద్యా విభాగం ఆచార్యులు, విద్యార్థులు నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపును స్వీకరిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సైతం స్వచ్ఛభారత్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ విభాగాలలో నిర్వహించాలని ఆదేశించారు. దీనిలో భాగంగా విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు ఆధ్వర్యాన విద్యార్థులు, ఆచార్యులు ఆర్ట్స్ కళాశాల పరిసరాలలో వ్యర్థాలను ఏరివేశారు. అనంతరం ప్రాంగణాన్ని శుభ్రంచేశారు. ఈ సందర్భంగా ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ స్వచ్ఛభారత్‌ను నిరంతర ప్రక్రియగా చేపడతామన్నారు. త్వరలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆలీ, డాక్టర్ సాల్మన్‌రాజు, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ మూర్తి, విభాగ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుసులవాడలో మైనింగ్‌ను రద్దుచేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంగారావు

ప్రజాశక్తి -తగరపువలస : ఆనందపురం మండలం కుసులవాడలో మైనింగ్ తవ్వకాలకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదలచేసిన నోటిఫికేషన్‌ను రద్దుచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుసులవాడ భూముల్లో క్వార్ట్ జెట్ తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడాన్ని స్థానిక ప్రజలు ఇప్పటికే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కొండలను, ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు లేదా అని ప్రశ్నించారు. కుసులవాడలో మైనింగ్ తవ్వకాల వల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతుందని అక్కడున్న పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్న ట్లు వివరించారు. ఆ ప్రాంత ప్రజల జీడి, మామిడి, కొబ్బరి తోటలతోపాటు ఇతర పంటలకు అపారనష్టం జరుగుతుందని చెప్పారు. గాలి, వెలుతురు, నీరు కలుషితం అవుతాయని, కాలుష్య ప్రమాదం పెరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కొండలను, పర్యావరణాన్ని కాపాడుతుందని స్థానిక ప్రజలు ఆశాభావంతో ఉన్నారని చెప్పారు. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే స్థానిక ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుందని హెచ్చరించారు. మైనింగ్ తవ్వకాలకు సంబంధించి ప్రభుత్వం ఈ నెల 28న కుసులవాడ గ్రామంలో తలపెట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణను ఐక్యంగా వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మైనింగ్ తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయ సేకరణ సభలో అర్జీలు ఇచ్చి నిరసన తెలపాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో పార్టీ జోన్ కమిటీ సభ్యులు రవ్వ నరసింగరావు, పార్టీ నాయకులు భాగం లక్ష్మి పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గంగారావు


జూపార్కు వద్ద నిరసననుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-ఆరిలోవ : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. జూ పార్క్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన శనివారం జూపార్క్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న డాక్టర్ల ప్రాణాలకు రక్షణ లేకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కేసును విచారించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేయాలని, మహిళలకు రక్షణ కల్పించే విధంగా కట్టు దిట్టమైన చట్టాలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో జూ పార్క్ వర్కర్స్ యూనియన్ నాయకులు, వర్కర్స్ పాల్గొన్నారు.

ఆరిలోవ జివిఎంసి ఎఫ్‌ఆర్‌యు వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని నినదించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌యు వైద్యాధికారి డాక్టర్ అనిత మాట్లాడుతూ, మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలను పటిష్టంగా అమలుచేయాలని కోరారు.


ఉన్నత విద్యామండలి సదస్సులో పాల్గొన్న వీసీ శశిభూషణరావు

ఉన్నత విద్యామండలి సదస్సులో ఎయు అధికారులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఉన్నత విద్యామండలి వర్చువల్ విధానంలో నిర్వహించిన సదస్సులో ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పాల్గొన్నారు. డిగ్రీ కోర్సుల డిజిటలైజేషన్, డాక్యుమెంట్ల డిజిటలైజేషన్ తదితర అంశాలపై ఉన్నత విద్యమండలి ఇంచార్జి ఛైర్మన్ ఆచార్య కె.రామమోహనరావు చర్చించారు. సదస్సులో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, కంప్యూటర్ సెంటర్ డీన్ ఆచార్య భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా దుర్ఘటనపై జగన్ వ్యాఖ్యలు సరికావు

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం: ఇటీవల అచ్యుతాపురం ఫార్మా దుర్ఘటన విషయంలో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సరిగ్గా పనిచేయలేనట్లు ఆయన మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటన తర్వాత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం హైలెవెల్ కమిటీ ఇచ్చిన సిఫార్సులను కూటమి ప్రభుత్వం అమలు చేయనట్లు మాట్లాడారని, ప్రభుత్వం ఏర్పడి రెండు నెలల వ్యవధిలోనే కమిటీ సిఫార్సులను అమలుచేయలేదనడం భావ్యంకాదన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత ప్రజల్లోకి వచ్చారన్నారు. పరదాల మధ్యలో పర్యటించే జగన్మోహన్‌రెడ్డికి ప్రజల కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ఎల్‌జి పాలిమర్స్ బాధిత కుటుంబాలపై క్రిమినల్ కేసిన పెట్టిన ఘనత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానిదని విమర్శించారు. అచ్యుతాపురం ఘటనకు, ఎల్‌జి పాలిమర్ ఘటనకు మధ్య చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఎల్‌జి పాలిమర్స్ ఘటనలో అమాయకులైన బయట ప్రజలు కూడా మృతి చెందారని గుర్తు చేశారు. ఈ దుర్ఘటనపై జగన్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. కంపెనీ ఇచ్చిన నష్టపరిహారం తప్ప ప్రభుత్వం ఏమి సాయం చేసిందని ప్రశ్నించారు. పాలిమర్స్ సమీపంలో ప్రభుత్వ 30 పడకల ఆసుపత్రి ఉందనే విషయాన్ని గుర్తుంచుకోకుండా వెంకటాపురం గ్రామంలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కడతానని వాగ్దానాలు చేశారని, బాధితులకు హెల్త్ కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇవన్నీ నెరవేరాయో అని ప్రశ్నించారు. ఆ కంపెనీ మూసివేత వల్ల వందలాదిమంది ఉపాధిని కోల్పోయారని, వారిని జగన్ ప్రభుత్వం ఆదుకుండా అని ప్రశ్నించారు. ఇటీవలే ఎల్‌జి పాలిమర్స్ అంశంపై శాసనసభలో తాను మాట్లాడని గుర్తుచేశారు. ఫ్యాక్టరీల్లో రక్షణ అంశాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్ణయాన్ని ప్రకటించారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫ్యాక్టరీలపై పూర్తి అవగాహన ఉందని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతారని చెప్పారు. అసత్య ఆరోపణను మానుకోవాలని జగన్మోహన్‌రెడ్డికి హితవు పలికారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా : పంచకర్ల

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండడానికి పంచకర్ల రమేష్‌బాబు 97వ వార్డు పరిధి గోపాలకృష్ణనగర్‌లో శనివారం నూతన గృహంలో అడుగుపెట్టారు. ఇంతవరకు ఆయన విశాఖ నగరంలో ఉండేవారు. నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా నగరానికి వెళ్లి చెప్పుకోవాల్సి వచ్చేది. ఇక ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా నేరుగా తనకు సమస్యలు వివరించవచ్చని ఆయన మీడియా ముఖంగా తెలియజేశారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులోనే ఉంటానని చెప్పారు.


గోపాలకృష్ణనగర్‌లో గృహ ప్రవేశం చేస్తున్న పంచకర్ల రమేష్‌బాబు దంపతులు

పలుచోట్ల శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



పలు వేషధారణలతో శ్రీదుర్గా స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్ ఆవరణలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు, బల రాముడు, గోపికలు, యశోద, రాధ వేషధారణలో విద్యార్థులు చూడ ముచ్చట గొలిపారు. ఉట్టి కొట్టే సంబరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సన్ స్కూల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు కె.లక్ష్మీలావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆనందపురం : లోడగలవానిపాలెం పంచాయతీ నేలతేరు గ్రామంలోని శ్రీదుర్గా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి సంబరాలు నిర్వహించారు, ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణ, సత్యభామ, గోపికల వేషధారణలతో హాజరై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నృత్య ప్రదర్శనలు, భగవద్గీత శ్లోకాలు, కోలాటం ప్రదర్శించారు, అనంతరం ఉట్టికొట్టే సంబరం జరిపారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు, ఉమా నారాయణ ఫౌండేషన్ చైర్మన్ బమ్మిడి శ్రీతారక్, పాఠశాల డైరెక్టర్ ధరపురెడ్డి శ్రీధర్, ప్రిన్సిపల్ భాగ్య అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆనందపురం మండలం వెల్లంకి రవీంద్రభారతి పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. సుమారు 300 మంది చిన్నారులు రాధాకృష్ణులు, గోపికల వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమములో పాఠశాల ప్రిన్సిపల్ ఆర్ ఉమామహేశ్వరరావు, నార్త్ ఆంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి ఎన్.వెంకటేష్, సిజిఎం జిఆర్.వసంత తదితరులు పాల్గొన్నారు.

నీళ్లకుండీలులోని శ్రీసాయి స్వామి వివేకానంద పాఠశాలలో చిన్నారులు శ్రీకృష్ణుడు, యశోద, గోపికలు, వసుదేవుడు వేషధారణలతో అలరించారు. అనంతరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం శ్రీగాయత్రి హైస్కూల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు కృష్ణుడు, గోపికలు వేషధారణతో అలరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి.రామ్ కుమార్, హెచ్‌ఎం వై.నగేష్ పాఠశాల యజమాన్య సభ్యులు ఐయనాల అప్పారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు ప్రిన్సిపల్ పీలా ఆశ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. పాఠశాల సిబ్బంది సుచరిత, హీరలాల్, జయలక్ష్మి, నాగశ్రీ శిక్షణలో విద్యార్థులు చేసిన కృష్ణుడు, గోపికల నృత్యాలు, ఉట్టి కొట్టడం, చిన్ని కృష్ణుల అల్లరి వంటి రూపకాలు అలరించాయి.

కె.కోటపాడు : స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. పిల్లలందరూ రాధాకృష్ణులు వేషధారణ, ఆటపాటలతో అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్‌కె.ఖాసీం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు యాదవ్ యూత్ సంఘం నాయకులు, పెద్దలు తెలిపారు. 25న ముగ్గులు పోటీలు, 26న ఉదయం పిడతల పోటీలు, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, సాయంత్రం స్వామివారి ఊరేగింపు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని యాదవ సంఘం నాయకులు, ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి, వార్డు మెంబర్ బంధం అప్పలరాజు, హైస్కూల్ కమిటీ చైర్మన్ వారాది దేముళ్ళు కోరారు.

నక్కపల్లి: పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో శనివారం శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో చిన్న బాలవనం నుండి 2వ తరగతి చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో ఎంతగానో అలరించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు శ్రీ కృష్ణుడిని పూజించి, వెన్న, మీగడలను నైవేద్యంగా సమర్పించి, ఉట్టి సంబరాలలో ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణ శతక పద్యాలను పఠించి, నృత్య గానాలతో ప్రదర్శించి ఆహుతులను అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లిలోని గురూస్ స్కూల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉట్టెను కొడుతున్న చిన్నారులు

ఫార్మా ప్రమాదాలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

- అనకాపల్లి, విశాఖలో బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్

ఫార్మా కంపెనీల్లో జరుగుతున్న ప్రమాదాలపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. పరవాడ మండలంలోని సినర్జిన్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో గాయపడ్డవారిని, వారి కుటుంబ సభ్యులను విశాఖ ఇండస్ ఆసుపత్రిలో శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఫార్మా కంపెనీల్లో సరైన భద్రతా చర్యలు, స్కిల్డ్ లేబర్, కార్మికులకు సరైన శిక్షణ, సౌకర్యాలు లేవని, అందువల్లే ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని విమర్శించారు. ఇవి ప్రమాదాలు కావని, యాజమాన్యాలు చేసిన హత్యలని పేర్కొన్నారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ఫార్మా కంపెనీలపై సమగ్ర విచారణ జరిపించాలని, లోపాలు ఉన్న కంపెనీల లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, షేక్ రెహమాన్, పి.చంద్ర శేఖర్, ఎం.మన్మధరావు, సిఎన్. క్షేత్రపాల్ పాల్గొన్నారు.

యాజమాన్యాలను అరెస్టు చేయాలి

అనకాపల్లి : ఫార్మా కంపెనీలలో వరుసగా జరుగుతున్న ఘోర ప్రమాదాలకు ఫార్మా యాజమాన్యాలు, ప్రభుత్వం, అధికారులు బాధ్యత వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు.చేశారు. ఫార్మా ప్రమాదంలో గాయపడి అనకాపల్లిలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శనివారం ఆయన పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి, ప్రభుత్వం ప్రకటించిన పరిహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడద్దని, ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందే వరకు పూర్తి సహకారం అందిస్తామని వాళ్లకి హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక మీడియాతో ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురం సెజ్‌లో 288, పరవాడలో 90 శ్రీకాకుళం జిల్లా పైడి భీమవరంలో 40 ఫార్మా కంపెనీలు ఉన్నాయని, వీటిలో తరచు ప్రమాదాల జరుగుతూ కార్మికులు విగత జీవులుగా, క్షతగాత్రులుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యాలకు లాభాలే తప్ప కార్మికుల జీవితాలు అవసరం లేదా అని ప్రశ్నించారు. తక్షణమే ఎమ్‌డి, పాలకవర్గాన్ని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెవివి.ప్రసాద్, అనకాపల్లి, విశాఖ జిల్లా కార్యదర్శులు బాలేపల్లి వెంకటరమణ, ఎం.పైడిరాజు, నాయకులు అత్తిలి విమల, జి.గురుబాబు, ఆర్.అప్పలరాజు, బి.సుబ్బలక్ష్మి, బి.పరమేశ్వరి, వి.అర్జున్, కాసుబాబు, వి.కన్నబాబు, జి.ఫణింద్ర, బాబ్జి, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.



ఫార్మా ప్రమాద క్షతగాత్రునితో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ శాంతి ప్రభ

మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి- కశింకోట

ఇంటి పరిసరాల్లో మురుగునీరు లేకుండా ప్రజలు చూసుకోవాలని అనకాపల్లి జిల్లా జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ఎం.శాంతి ప్రభ అన్నారు. మండలంలోని సింగవరం గ్రామంలో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు ద్వారా వ్యాపించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా అందరూ పాటించాలన్నారు. ముందుగా తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జోనల్ మలేరియా విస్తరణ అధికారి బి.తిరుపతిరావు, వైద్యాధికారి డాక్టర్ యు.రమేష్, ఆరోగ్య విస్తరణాధికారి వివి.సుబ్బారావు, ఆరోగ్య బోధకులు కెజి. నర్సింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మా కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో



లంకెలపాలెంలో రాస్తారోకో చేస్తున్న సిపిఎం, సిఐటియు నేతలు, కార్మికులు

ప్రజాశక్తి - పరవాడ

ఫార్మాసిటీ, సెజ్ పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ శనివారం లంకెలపాలెం -పరవాడ మెయిన్ రోడ్‌పై బ్రిడ్జి వద్ద సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఎసెన్షియా, సినర్జిన్ కంపెనీల్లో జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, కార్మికుల ప్రాణాలు రక్షణ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 17 మంది ప్రాణాలను బలిగొన్న ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యాన్ని అరెస్టు చేయకపోవడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. యాజమాన్యాలకు రాయితీ ఇస్తూ కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం వల్లే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్మికుల విధులకు వెళ్లాలంటే క్షణక్షణం భయాందోళన పడే దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఈజెడ్, పరవాడ ఫార్మసిటీలో వేలాదిమంది కార్మికులు పనిచేస్తున్నా, ఈ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లేకపోవడంతోనే కార్మికుల ప్రాణాలు పోతున్నాయని వాపోయారు. ప్రతిదానికి విశాఖపట్నం వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడటంతో ఈ లోగా కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో బర్నర్ వార్డుతో కూడిన 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం ప్రభుత్వం అందించాలని కోరారు. ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు పరిశ్రమలను తనిఖీ చేసి భద్రతల ప్రమాణాలు మెరుగుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, నాయకులు కర్ణం వెంకట్రావు, ఫార్మసిటీ యూనియన్ నాయకులు లక్ష్మణరావు, సంతోష్, రమేష్, నాగరాజు, దేవ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రక్షణ కల్పించాలని పోస్టర్ ఆవిష్కరణ

అచ్యుతాపురం : ఎస్ఇజెడ్ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ సిఐటియు ముద్రించిన వాల్ పోస్టర్‌ను అచ్చుతాపురంలో ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము మాట్లాడుతూ పరిశ్రమలలో తక్షణమే సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎసెన్షియా ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి యాజమాన్యాన్ని తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె. సోమునాయుడు, నాయకులు రాజు, చందు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పని చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ బి.రాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో జువాలజీ, ఒకేషనల్ కోర్సులలో కంప్యూటర్ సైన్స్, జిఎఫ్‌సి పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గౌరవ వేతనం రూ.10వేలు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జువాలజీ అధ్యాపక పోస్టుకు ఎంఎస్సీ జువాలజీలో 50 శాతం మార్కులతో, కంప్యూటర్ సైన్స్ పోస్టు కోసం బీటెక్ కంప్యూటర్స్‌లో 50 శాతం మార్కులతో, జిఎఫ్‌సి పోస్టుకు ఎంఎ ఎకనామిక్స్ (రూరల్ డెవలప్మెంట్లో)లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని కోరారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు ఈనెల 28వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

నేవీ బాధిత రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-రాంబిల్లి

మండలంలోని పెదకలవలపల్లి గ్రామానికి చెందిన నేవీ ప్రహరీ బాధిత రైతులకు న్యాయం చేయాలని మాజీ ఎంపీటీసీ రావి దేవుళ్ళు డిమాండ్ చేశారు. నేవీ చేపట్టిన ప్రహరీని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు 300 పైగా రోజుల నుండి నిర్వహిస్తున్న ఆందోళనకు ప్రభుత్వం దిగిరాకపోవడంతో దేవుళ్ల నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విషయం విధితమే. దేవుళ్ల చేపట్టిన నిరాహార దీక్ష శనివారం నాటికి నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేవీ ప్రహరీ నిర్మాణం వలన తమ గ్రామంలో అనేక మంది రైతు కుటుంబాలు సాగు చేసిన జీడి మామిడి, కొబ్బరి పంటలు నష్టపోతున్నామని తెలిపారు. తమ జిరాయితీ భూములకు రహదారులు కోల్పోతున్నామని, పాడి దెబ్బతింటుందని, శారదా నది పొంగినప్పుడు ఈ కొండలే తమకు జీవనాధారమని తెలిపారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు పాల్గొన్నారు.



నిరవధిక నిరాహార దీక్షలో కూర్చున్న మాజీ ఎంపిటిసి దేముళ్లు తదితరులు

పంటల్లో సమగ్ర పోషణ, సస్యరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

పంటల్లో సమగ్ర పోషక యాజమాన్యం, సస్యరక్షణ గురించి మండలంలోని దిబ్బిడి గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం (ఆత్మ) ఆధ్వర్యంలో శనివారం శిక్షణ కార్యక్రమంలో నిర్వహించారు. డిఆర్‌సి అనకాపల్లి ఎడిఎ పి.శ్రీధర్, చోడవరం ఎడిఎ వి.రవీంద్రనాథ్ ముదురు నాట్లు వేసుకునేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. కొండెంపూడి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్ వరిలో పాటించవలసిన ఎరువుల యాజమాన్యం, పురుగులు, తెగులు యాజమాన్యం గురించి తెలియజేశారు. శాస్త్రవేత్త సత్తిబాబు కూరగాయల సాగులో తీసుకోవలసిన మెలుకవులు, ప్రస్తుతం పరిశోధనా కేంద్రంలో లభిస్తున్న కూరగాయలు నారు గురించి వివరించారు. పెరట్లో పెంపకానికి ఉచితంగా నారు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బుచ్చయ్యపేట వ్యవసాయ అధికారి బి.భాస్కరరావు, డిఆర్సి వ్యవసాయ అధికారి పి.విజేత, విఎఎ వరప్రసాద్, ఏఈఓ వాణి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి భాస్కరరావు

అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు

- ఏడెనిమిది నెలలుగా పని చేయని వైనం
- పలు కేసుల దర్యాప్తులో లేని పురోగతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల అదుపులో కీలక సమాచారం సేకరణలో సీసీ కెమెరాల పాత్ర ప్రముఖమైనది. ఏదైనా నేరం జరిగినప్పుడు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యే దృశ్యాలు ఆ కేసు దర్యాప్తునకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇంతటి కీలకమైన సీసీ కెమెరాలు మండలంలో పలు ప్రాంతాల్లో 7, 8 నెలలుగా పని చేయడం లేదు. పలు గ్రామాల్లో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా ఉన్నాయన్న విమర్శలు వినబడుతున్నాయి.

బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డాది, బంగారమెట్ట, దిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజాం నాలుగు రోడ్ల కూడలి తదితర ప్రాంతాల్లో రెండేళ్ల క్రితం పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలు కొంతకాలంగా పని చేయకపోవడంతో దొంగతనాలు, ప్రమాదాలకు జరిగినప్పుడు, గంజాయి రవాణా వంటి సమయాల్లో పోలీసులు కేసు దర్యాప్తులో నానా ఇబ్బందులు పడుతున్నారు. గత నెలలో దిబ్బిడి గ్రామానికి చెందిన పలువురు రైతులకు సంబంధించి గొర్రె పొట్టేలు, వేలాది రూపాయలు విలువచేసే నాటు కోళ్లను బైకులు, ఆటోలపై వచ్చి అపహరించుకుపోయారు. దీనిపై బాధిత రైతులు బుచ్చయ్యపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా నేటికీ ఆ కేసులో ఎటువంటి పురోగతి లేదని రైతులు వాపోతున్నారు. చిన్నప్పన్నపాలెంలో జరిగిన దొంగతనం, మండలంలోని పలు గ్రామాల్లో బైకులు అపహరణ వంటి కేసుల్లో నిందితులను గుర్తించలేదని బాధితులు చెబుతున్నారు.

గతంలో సీసీ కెమెరాల ద్వారా నిందితుల గుర్తింపు

గతేడాది మండలంలోని కొండపాలెం, బుచ్చయ్యపేట, దిబ్బిడి, చిన్నప్పన్నపాలెంతో పాటు రావికమతం మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో హుండీలను దొంగలు ఎత్తుకుపోయి నగదు అపహరించారు. నాటి పోలీసులు దర్యాప్తులో భాగంగా దిబ్బిడి ఆంజనేయస్వామి ఆలయంలో గల సిసి కెమెరాలను పరిశీలించి దొంగలను గుర్తించి అరెస్టు చేశారు.

ముఖ్యమైన ప్రాంతాల్లోనూ పని చేయని వైనం


మండలంలో మేజర్ పంచాయతీ, చోడవరం నియోజకవర్గంలో ముఖ్యమైన జంక్షన్ వడ్డాది. ఏజెన్సీకి ముఖద్వారంగా ఉన్న ఈ జంక్షన్ గుండా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ జంక్షన్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొద్ది రోజులుగా పని చేయడం లేదు. బంగారుమెట్ట- కశింకోట రోడ్డును ఇటీవల వెడల్పు చేయడంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. ఇటీవల రోడ్డు వెడల్పు చేయడంతో ఏజెన్సీ ప్రాంతం అనకాపల్లి, విశాఖపట్నం ప్రాంతాలకు వందలాది వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈ క్రమంలో గంజాయి అక్రమ రవాణా సాగుతోంది. పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే పై ప్రాంతాల్లో సీసీ కెమెరాలు మరమ్మతులకు గురికావడంతో నిందితుల గుర్తింపు, కేసుల దర్యాప్తునకు పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దర్యాప్తులో ఉపకరించే సీసీ కెమెరాలను తక్షణమే పునరుద్ధరణ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎస్‌ఐ వివరణ

ఈ విషయంపై బుచ్చయ్యపేట ఎస్సై డి.ఈశ్వరరావును వివరణ కోరగా కొన్ని సీసీ కెమెరాలు మరమ్మతులకు గురయ్యాయని, వాటిని బాగుచేయిస్తున్నామని తెలిపారు. బుచ్చయ్యపేట జంక్షన్లో కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.



వడ్డాది నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఉన్న సీసీ కెమెరాలు



ఎంపీ సిఎం రమేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఎన్‌టిపిసిలో మత్స్యకారులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-పరవాడ : స్థానిక ఎన్‌టిపిసి సింహాద్రిలో మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, ఎంపిటిసి అర్జిల్లి దేవి రవి ఆధ్వర్యంలో శనివారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌కు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుజాత ముత్యాలు మాట్లాడుతూ ఎన్టీపీసీ పైపులైన్లు, యాష్, కాలుష్యం వల్ల మత్స్యకార జీవనాధారమైన సముద్రం, ఉప్పుటేరు కలుషితమై మత్స్య సంపద నశించిపోతుందని చెప్పారు. దీంతో చేపలవేట కోల్పోయిన ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఎన్టీపీసీలో ఉపాధి కల్పించాలని 2011లో ఎన్టీపీసీ ఎడిఎమ్ గేట్ వద్ద సుమారు పదివేలు మందితో వారం రోజులు పాటు మహాధర్నా చేసినట్లు గుర్తు చేశారు. దీంతో నాటి విశాఖపట్నం కలెక్టర్ ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఎన్టీపీసీలో 60 ఉద్యోగాలు ఇవ్వమని లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేశారని, కాని 13ఏళ్ల గడుస్తున్నా నేటికీ ఎన్టీపీసీ యాజమాన్యం ఉద్యోగాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన ఎంపీ రమేష్ ఎన్టీపీసీ సీజీఎంతో మాట్లాడి మత్స్యకారులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చింతకాయల అమ్మోరు, మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, మత్స్యకార నాయకులు సూరాడ ముత్యాలరావు, కోవిరి రాయుడు, వాసుపల్లి నరేంద్ర, చింతకాయల మహేష్, సమ్మంగి సోమేశ్వరరావు, సమ్మంగి అప్పలరాజు, మైలపల్లి బంగారు రాజు, చింతకాయల బంగారు రాజు, చిన్నారావు పాల్గొన్నారు.

27న గురుకులంలో మిగిలిన సీట్లుకు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి -సబ్బవరం : స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో మిగిలివున్న బాలుర ఎస్సీ కేటగిరీలో 17 సీట్లకు ఈ నెల 27న మంగళవారం స్పాట్ అడ్మిషన్ కల్పించడం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదివిన విద్యార్థులు దీనికి అర్హులని పేర్కొన్నారు. ప్రవేశం పొందవలసిన వారు విద్యార్థి ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డుతో 27న మంగళవారం నేరుగా సబ్బవరం గురుకుల పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

ఆలయ ద్వారబంధం ప్రతిష్ట

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో గల కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన ద్వారబంధ ప్రతిష్ట కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన శరగడం వెంకటేశ్వరరావు ఆలయానికి వితరణ ఇచ్చిన 10 సెంట్ల స్థలంలో 2023 ఫిబ్రవరిలో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, ఏప్రిల్ 1వ తేదీన శంకుస్థాపన చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ద్వారబంధ ప్రతిష్ట కార్యక్రమంలో వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, ద్వారపూడి పరమేశ్వరరావు, బొడ్డేడ నాగేశ్వరరావు, సర్పంచ్ భీమిశెట్టి మంగ లక్ష్మి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శరగడం జగన్నాథరావు, అన్నమాచార్య ఆలాపన బృంద సభ్యులు నాగేశ్వరి, స్టీరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ద్వారబంధాన్ని ప్రతిష్టిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు

నిర్వహణ లేని టాయిలెట్స్

ఇబ్బందులు పడుతున్న రైలు ప్రయాణికులు

ప్రజాశక్తి - యలమంచిలి

రైల్వే స్టేషన్‌లో మరమ్మతులు, కొత్త నిర్మాణ పనులు నేపథ్యంలో రైల్వే అధికారులు తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. ఈ మరుగుదొడ్లు నిర్వహణ లేక ఉపయోగించలేనంతగా కంపు కొడుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం మూడు నాలుగు వేల మంది ప్రయాణించే యలమంచిలి రైల్వే స్టేషన్లో మరుగు సదుపాయం సరిగ్గా నిర్వహించకపోవడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలైతే చెప్పుకోలేని అసౌకర్యంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై రైల్వే స్టేషన్ స్టేషన్‌మాస్టర్‌ను వివరణ కోరగా టాయిలెట్స్ నిర్వహణ అన్నది తుని మెయింటెనెన్స్ విభాగం వారిదని తెలిపారు. అక్కడి నుంచి మనుషులు వచ్చి రోజూ శుభ్రం చేస్తుంటారని, ఫిర్యాదు ఉంటే ఇక్కడున్న బుక్‌లో రాస్తే వాటిని వారు చూసి సరిచేస్తారని చెప్పారు.



అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్స్

శవ రాజకీయాలు చేస్తున్న జగన్

ప్రజాశక్తి-అనకాపల్లి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రాజకీయ ప్రయోజనాల కోసం శవరాజకీయాలు మొదలు పెట్టారని తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. అబద్దాలు, తప్పుడు ప్రచారాలే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అచ్యుతాపురంలో సెజ్ ప్రమాద ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు అన్ని విధాల అండగా నిలబడితే నిస్సిగ్గుగా జగన్ దుష్ప్రచారాలను చేస్తున్నాడని ధ్వజమెత్తారు. మీ అబద్దాలు నమ్మబోమని ముఖం మీద కొట్టినట్టుగా చెప్పిన జనం 11 సీట్లకే పరిమితం చేసినా జగన్ వైఖరిలో ఎటువంటి మార్పు రాలేదని ఎద్దేవా చేశారు. ఎల్జీ పాలిమర్స్ ప్రమాద సమయంలో జగన్ ప్రకటించిన పరిహారం పూర్తిస్థాయిలో ఇప్పటికీ అందలేదని, దుర్ఘటన జరిగిన తర్వాత 15 రోజుల వ్యవధిలో చనిపోయిన ముగ్గురికి ఒక లక్ష పరిహారంతో సరిపెట్టిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ కార్యదర్శి కొట్టి రామకృష్ణ దొర, అనకాపల్లి జిల్లా నోబెల్ టీచర్స్ గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, మళ్ల శివన్నారాయణ, దులం ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నేత నాగజగదీశ్వరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్

డిగ్రీ కళాశాల విద్యార్థులకు వర్క్‌షాప్

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ డిపార్టుమెంటు ఆధ్వర్యాన డిగ్రీ విద్యార్థులకు శనివారం వర్కుషాప్ నిర్వహించారు. 'ఎంట్రప్రెన్యూర్షిప్ డెవెలప్మెంట్ స్టార్ట్ అప్ స్కిల్స్'పై అవేర్నెస్ ప్రోగ్రాం జరిగింది. ఎన్ఐఈఎస్‌బియూడి వారు స్పాన్సర్షిప్ అందించారు. రిసోర్స్ పర్సన్ వసంత పట్నాయక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, కామర్స్ హెచ్ఓడి ఎం.గోవిందరావు, తెలుగు లెక్చరర్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, కామర్స్ లెక్చరర్ బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలం గర్సింగి డిపోలో గుమస్తాగా 20 ఏళ్లగా పని చేస్తున్న ఆచారి అనారోగ్యంతో మృతి చెందడంతో, దేవరపల్లి మండల రేషన్ డీలర్లు ఆచారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు ఆచారి కుటుంబ సభ్యులకు, డీలర్ల యూనియన్ తరపున రూ.10,200 శనివారం అందించారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ, డీలర్లు అందరూ ఒక కుటుంబమని, తమలో ఎవరికి కష్టమొచ్చినా యూనియన్ తరపున వారికి అండగా నిలుస్తామని చెప్పారు.



ఆర్థిక సాయం అందిస్తున్న డీలర్లు

కారిడార్ భూముల్లో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములను శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి పరిశీలించారు. కాగిత మీదగా కారిడార్ రోడ్డు కోసం సేకరించిన భూములను పరిశీలించారు. పాటిమీద, మూలపర్ర ప్రాంతాల్లో బల్క్ డ్రగ్ యూనిట్ కోసం కేటాయించిన భూములకు సంబంధించి సరిహద్దులను, కారిడార్ కోసం సేకరించిన భూములకు సంబంధించి మ్యాపును పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తీర ప్రాంతాన్ని పరిశీలించారు. ఆర్ ఆర్ ప్యాకేజీ, ఇతర సమస్యలపై సమగ్ర నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పూర్తిస్థాయిలో నివేదిక అందజేయాలన్నారు. పలువురు నిర్వాసితులు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె వెంట ఆర్‌డిఓ జయరాం, తహశీల్దార్ అంబేద్కర్, ఏపీఐఐసీ అధికారులు, ఎస్ఐ సన్నిబాబు పాల్గొన్నారు.


భూములను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ , జెసి


విద్యార్థితో మాట్లాడుతున్న జిల్లా జడ్జి

అనాథాశ్రమాన్ని సందర్శించిన జిల్లా జడ్జి

ప్రజాశక్తి-కోటవురట్ల: ఇటీవల కైలాసపట్నం అనాథాశ్రమంలో జరిగిన సంఘటన నేపథ్యంలో శనివారం జిల్లా జడ్జి శ్రీ దివ్య సందర్శించారు. ఆశ్రమ నిర్వాహకుల కుటుంబ సభ్యులను జరిగిన సంఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమం ఎన్ని సంవత్సరాలుగా కొనసాగుతుంది? విద్యార్థులకు అందిస్తున్న అందించిన సేవలు, ఆశ్రమానికి వచ్చే దాతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, హైకోర్టు ఆదేశాల మేరకు ఆశ్రమాన్ని సందర్శించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం జిల్లా జడ్జి సీయోజాన్ ఖాన్ పాల్గొన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి-కొత్తకోట:ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా రికార్డులతో పాటు హెల్మెట్ ధరించాలని, లేదంటే కేసులు నమోదు చేస్తామని కొత్తకోట ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. కొత్తకోట పోలీస్ స్టేషన్ సమీపంలో శనివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బిఎన్ రోడ్డు పై రాక పోకలు సాగించే వాహనాలల రికార్డులు పరిశీలించారు. రికార్డులు, హెల్మెట్‌లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే ఫైన్‌తో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనదారులు నియమనిబంధనలు పాటించాలని ఎస్ ఐ కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు..

రెల్లిలకు రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి- గొలుగొండ: రెల్లిలకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని శనివారం రెల్లి కులస్తులు ఏఎల్.పురం గ్రామంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వాతంత్రం వచ్చిన నాటి నుండి రెల్లిలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికనా ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెల్లి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న నాయకులు

నర్సీపట్నం టౌన్:ఎస్సీ వర్గీకరణలో అట్టడుగులో ఉన్న రెల్లి కులస్తులకు 5 శాతం రిజర్వేషన్ వాటా కేటాయించకుంటే భారీ ఆందోళన చేపడతామని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు తెలిపారు. శనివారం చెట్టుపల్లిలో మీడియాతో మాట్లాడారు. విద్య, ఉద్యోగ, సంక్షేమం, రాజకీయ రంగంలో రెల్లిలకు ఫలాలు అందలేదన్నారు. ఈ రంగాల్లో తమకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెల్లిలకు అన్యాయం చేస్తానంటే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బెంనేసులు, రిషి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి సరోజిని

వృథాగా ఉన్న పొలాలను గుర్తించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల వ్యాప్తంగా వృథాగా దర్శనమిస్తున్న రైతుల వ్యవసాయ పంట భూమిలతో పాటు రెవెన్యూ భూములను గుర్తించాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని సరోజిని సూచించారు. శనివారం తహసిల్దార్ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఈ క్రాఫ్ నమోదు పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని ఇప్పటికే దాదాపుగా వరి సాగు 50 శాతం పూర్తి కావచ్చిందని తెలిపారు. మిగతా పంటల వివరాలు నమోదు చేయాలన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో పందూరు గ్రామంలో వివాదంలో ఉన్న కొన్ని భూములు మినహా మండలంలో ఎక్కడా ఖాళీగా పంట పొలాలు లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక గ్రామంలో శనివారం సత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, తెలుగు యువత నాయకులు కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు..

పంటల సస్యరక్షణపై శిక్షణ

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం దొండపూడి గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ)ఆధ్వర్యంలో దొండపూడి గ్రామంలో శనివారం ప్రధాన పంటలో పాటించవల్సిన సమగ్ర పోషక యాజమాన్యం, సస్యరక్షణ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏడిఏ శ్రీధర్ మాట్లాడుతూ, వరిలో పాటించవలసిన ఎరువుల యాజమాన్యంపై వివరించారు. శాస్త్రవేత్త రాజకుమార్ మాట్లాడుతూ, ముఖ్యమైన పంటలో పాటించవల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. శాస్త్రవేత్త సత్తిబాబు మాట్లాడుతూ, కూర గాయల సాగులో తీసుకోవాల్సిన మెలకువలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు విజేత, రూప, వ్యవసాయ శాఖ సిబ్బంది సాయి మణి, జగదీశ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోటవురట్లలో భారీ వర్షం

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుండి ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలన్ని జలమయమయ్యాయి. కురిసిన వర్షానికి ప్రధాన రహదారిలో నీరు నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. కొన్ని ప్రాంతాలలో కాలువలో నీరు ప్రవహించక పోవడంతో రోడ్లపైకి చేరింది.


కురుస్తున వర్షం


వీధి కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

వీధి కుక్కలు పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురం మేజర్ పంచాయతీలో వీధి కుక్కలను పట్టుకొని వ్యాక్సినేషన్ చేయించి దూర ప్రాంతాలకు తరలించామని సర్పంచ్ లోచల సుజాత, పంచాయతీ కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటీవల కాలంలో వీధి కుక్కలతో చిన్న పిల్లలు, పెనద్దలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేక చోట్ల చిన్న పిల్లలపై దాడులు చేస్తున్నాయని తెలిపారు. గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు కుక్కల ఏరివేత ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మమిడి కృష్ణ, గ్రామ పెద్దలు పెదబాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని..

పాడేరు ఆసుపత్రి ఉద్యోగుల నిరసన

సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీస్ అందజేత

ప్రజాశక్తి-పాడేరు: తమ సమస్యలు పరిష్కారం చేయాలని పాడేరు జిజిహెచ్ ఆసుపత్రి వివిధ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు శనివారం మధ్యాహ్నం ఆస్పత్రి వద్ద నిరసన నిర్వహించారు. ఈ మేరకు సమ్మె నోటీసును ఆసుపత్రి సూపరిండెంట్ విశ్వ మిత్ర కు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు, ఏఐటీయూసీ నాయకులు సుందరరావు, జల్లి రాజబాబు, అమర్ మాట్లాడుతూ, గత ఆరు నెలల నుంచి రావలసిన జీతం బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, అనేక మార్లు వివిధ స్థాయిలో ఉన్నటువంటి ఉన్నత అధికారులకు తెలియజేసినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. ఉద్యోగుల సమస్యలపై అధికారులతో చర్చించగా సమస్య పరిష్కరిద్దామని చెపుతూనే దాటవేత దొరనితో మాట్లాడుతున్నారన్నారు.జీతాలు పడకపోవటంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒక కాంట్రాక్టు స్టాఫ్ నర్స్ ఆత్మహత్యాయత్నం చేసుకోవడం జరిగిందన్నారు. అధికారులు స్పందించి అన్ని విభాగలలో పని చేస్తున్న ఉద్యోగుల జీతాలు చెల్లించాలన్నారు. వివిధ విభాగలలో ఖాళీగా ఉన్న సిబ్బందిని వెంటనే నియమించాలన్నారు. వచ్చేనెల 7- నుండి అన్ని విభాగలలో ఉన్నటువంటి ఉద్యోగులతో కలిసి సమ్మె చేపడతామన్నారు. ఈ కార్యక్రమములో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కళాభారతి వార్షికోత్సవం



స్వర్ణ కమలం బహూకరణలో అతిథులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:విశాఖ మ్యూజికల్ డాన్స్ అకాడమీ కళాభారతి 38వ సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న వార్షికోత్సవంలో భాగంగా తొలిరోజు వేడుకలు శనివారం సాయంత్రం మద్దిలపాలెంలోని కళాభారతిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు, తూర్పు నావికాదళ విభాగాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ పెందార్కర్ మాట్లాడుతూ ప్రాచీన కళలు ఎంతో గొప్ప వని వాటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరి మీద ఉందని అన్నారు.

అనంతరం కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ సంగీతానికి ఎల్లలు లేవని భారత దేశంలో అన్ని ప్రదేశాల నుంచి కళాకారులను తెప్పించి ఇక్కడ కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందదాయకమని అన్నారు. అనంతరం పద్మశ్రీ సంగీత కళానిధి ప్రఖ్యాత క్లారినెట్ వొకలిస్టు విద్వాంసులు ఎ.కే.సీ నటరాజన్ కు నాద విద్యా భారతి బిరుదు ప్రధానం చేస్తూ లక్ష రూపాయల నగదు రెండు లక్షల విలువచేసే స్వర్ణకమలం నూతన వస్త్రాలు ప్రశంసా పత్రాన్ని అతిధుల చేతుల మీదుగా అందించారు. అనంతరం నటరాజన్ నిర్వహించిన క్లారినెట్ కాన్సెర్ట్ అందరినీ అలరించింది ఈ కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి గుమ్మలూరి రాంబాబు, పైడా కృష్ణ ప్రసాద్, మల్లికా మనోజ్ గ్రంధి, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మనోజ్ వైభవ్ జేమ్స్ అండ్ జువెలరీ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక సేవలో భాగంగా కళలను సంగీతాన్ని ప్రోత్సహించడంలో గత 20 సంవత్సరాలుగా విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కళాభారతిలో జరుగు నేషనల్ ఏమినెన్స్ అవార్డు ఫంక్షన్లలో 2002 సంవత్సరం నుండి భారతదేశంలో గల ప్రఖ్యాత సంగీత కళాకారులను స్వర్ణకమలంతో సత్కరించి తమ వంతు సహకారాన్ని అందిస్తుంది. ప్రఖ్యాత క్లారినెట్ వొకలిస్టు విద్వాంసులు ఏకేసీ నటరాజన్ కు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గాంధీ మల్లికా మనోజ్ స్వర్ణకమలం బహుకరించారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: నగరంలోనూ, జిల్లాలోనూ గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ మీటింగు హాలులో పోలీస్ కమిషనర్, జాయింట్ కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పొల్యూషన్ బోర్డులు జారీ చేసిన నిబంధనలను అందరూ పాటించాల్సిందేనని తెలిపారు. మండపాలు పెట్టుకు నేందుకు, ఉత్సవాలు నిర్వహించు కునేందుకు అనుమతులు జారీ చేసేందుకు గాను కలెక్టరేట్లో సింగిల్ విండో డెస్కు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇది ఈ నెల 25 నుంచి అందుబాటులోకి వస్తుందన్నారు. నిర్వాహకులు అనుమతులు తీసుకునే సమయంలోనే నిమజ్జనం తేదీని తెలపాల్సి ఉంటుందని చెప్పారు. నిమజ్జన సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.



పట్టుబడ్డ ట్రాక్టర్

ఇసుక ట్రాక్టర్లు, లారీల సీజ్

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో గొట్టువాడ వరాహ నది నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి స్థానిక పోలీసులు పట్టుకొని స్టేషన్కు తరలించారు. ఎడ్లబళ్ళ ద్వారా సమీపంలో డంపింగ్ చేసి ట్రాక్టర్ల ద్వారా రవాణా చేపడుతున్నారు. ముందస్తు సమాచారంతో పోలీసులు నిఘా వేసి పట్టుకున్నారు. మండలంలో నదీ పరివాహక ప్రాంతమైన గొట్టువాడ, చౌడువాడ, పందూరు, కైలాస పట్నం గ్రామాల నుండి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై రమణయ్య తెలిపారు.

నక్కపల్లి:మండలంలోని అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసి, జరిమానా విధించినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు శనివారం వేంపాడు జంక్షన్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



వైద్య శిబిరానికి హాజరైన స్థానికులు

ఉచిత దంత, కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్గాజువాక లయన్స్ క్లబ్, విశాఖ డిస్టెలరీస్, విజయ డయాగ్నొస్టిక్ సెంటర్, విషన్ ట్రీ సంయుక్తంగా విశాఖ డిస్టలరీస్ అధినేత లయన్ నున్న శ్రీనివాస్‌రావు ఆధ్వర్యములో నర్సీపట్నం రోడ్డులోని సుందరయ్యపేటలో శనివారం ఉచిత దంత, కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి సుమారు 400 మంది వరకు పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ శిబిరంలో పాల్గొన్న వారికి అవసరమైతే ఉచిత కంటి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శేషు ప్రసాద్, సత్యాల కోటేశ్వరరావు, సెక్రటరీ పలిశెట్టి లక్ష్మణ్, కోశాధికారి బలివాడ సత్యారావు పాల్గొన్నారు.



పశువులకు పరీక్షలు చేస్తున్న పశువైద్యులు

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని గొట్టివాడ అగ్రహారం గ్రామంలో పశువుల టీకా కార్యక్రమాన్ని మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెప్టెంబర్ 18వ తేదీ వరకు ఉచిత గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం చేపడతామని తెలిపారు. గ్రామంలోని పాడి రైతులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో కె.జె పురం పశు వైద్యాధికారి మణి లక్ష్మణ్, గొట్టివాడ అగ్రహారం పశు సహాయకులు మోది నాయుడు పాల్గొన్నారు.

జగన్ శవ రాజకీయాలు మానుకోవాలి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికైనా శవ రాజకీయాలు మానుకోవాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. అనకాపల్లిలో పర్యటించిన జగన్మోహన్ రెడ్డి ఇష్టం వచ్చినట్టు మాట్లాడారన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పల్లా మాట్లాడుతూ, అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో జరిగిన ప్రమాదంపై ప్రభుత్వం తన బాధ్యతను సక్రమంగా నిర్వహించిందన్నారు.కెజిహెచ్ వద్ద వైసిపి నేతలు బాధితులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. లీగల్ హెయిర్ లేకుండా చెక్కులు ఇవ్వరని వైసిపి నేతలకు తెలియదా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పరిశ్రమల్లో భద్రత లేదని ఎన్నోసార్లు చెప్పామని, అప్పట్లో పట్టించుకోలేదని, ఆ ఫలితమే ఎస్సెన్షియా ప్రమాదం అని ఆరోపించారు. తండ్రి చనిపోతే అధికారం కోసం జగన్ సంతకాలు చేయించారని ఆరోపించారు. 2019లో ఎన్నికల బాబాయి పేరుతో రాజకీయం చేశారన్నారు.భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సేఫ్టీ ఆడిట్ పై దృష్టి పెడతామన్నారు. ఎంపి శ్రీభరత్ మాట్లాడుతూ, విశాఖలో ప్రమాదాలు జరగడానికి అప్పటి వైసిపి ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. ఎల్ ఫార్మా ప్రమాదంలో జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. బాధితుల కోసం పెడతానన్న హాస్పిటల్ లేదన్నారు. ప్రస్తుతం బాధితులకు కూటమి ప్రభుత్వం వుంటుందన్నారు. పరిశ్రమల్లో భద్రతపై తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ఈ సమావేశంలో టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టిడిపి దక్షిణ ఇంచార్జ్ సీతంరాజు సుధాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:ఇంకుడు గుంతల ఏర్పాటుపై అవగాహన అవసరమని సంఘమిత్ర సోషల్ సర్వీసెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆళ్ల సూరిబాబు తెలిపారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఇంకుడు గుంతలపై అవగాహన ఉద్యమం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 100 గజాల స్థలంలో ఉన్న ఇంటికి కచ్చితంగా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి ప్రసాదించిన వర్షపు నీటిని భూగర్భంలోకి పంపించి జలాలు పెంచేలా కృషి చేయాలన్నారు. బోరు ఉన్న ప్రతి ఇంటికి తప్పనిసరిగా ఇంకుడు గుంత ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. నీటి సంరక్షణపై బాధ్యత లేనివారికి మున్సిపల్ కుళాయి నీటిని నిలిపివేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో యువసేన ప్రతినిధి హరిప్రసాద్, బ్రహ్మ కుమారీస్ ప్రతినిధి బి.కె రమ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు నిర్వాసితుల వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు శనివారం నిర్వాసితులు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేసారు. డిఎల్ పురంలో సర్వే నెంబర్ 85లో సుమారు 100 మంది పేద రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, సాగులో ఉన్న పేద రైతులను గుర్తించి పరిహారం అందజేయాలని గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు గింజాల వెంకటరమణ కలెక్టర్ కు సాగు దారులతో కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబరు 208 లో సుమారు 15 మందికి గతంలో సీలింగు ల్యాండ్ ఇవ్వడం జరిగిందని, పట్టాలు ఉన్నప్పటికీ నష్టపరిహారం ఇవ్వలేదని తెలిపారు.

నీట్ పీజీ పరీక్షలో సాహితి ప్రతిభ

- అక్కా చెల్లెలు ఇద్దరూ వైద్య విద్యలోనే ..



సాహితికి స్వీటును తినిపిస్తున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి -కొత్తకోట:ఆల్ ఇండియా నీట్ పీజీ పరీక్షలలో రావిక మతం మండలం కొత్తకోటకు చెందిన యువతి 981వ ర్యాంక్ సాధించింది. గ్రామానికి చెందిన కేదారిశెట్టి గురు సాహితి సూపర్ స్పెషాలిటి విభాగంలో ఈ ప్రతిభ కనబరిచింది. కాకినాడ రంగ రాయ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేస్తున్న యువతి గతంలో కూడా మంచి ప్రతిభ కనభరించింది. ఎంబిబిఎస్ ఎంట్రన్స్ నీట్ పరీక్షా ఫలితాల్లో 331తో స్టేట్ ర్యాంకు సాధించగా 5,581తో ఆల్ ఇండియా ర్యాంకు సాధించింది. కొత్తకోటలో కేదారిశెట్టి రామారావు - వైదేహి దంపతుల కుమార్తె గురు సాహితి ఇంటర్ విశాఖ నారాయణ కళాశాలలో చదవగా, కొత్తకోట సెయిట్ మేరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో పదవ తరగతి వరకూ విద్యను అభ్యసించింది.

అక్కా చెల్లెలు ఇద్దరూ వైద్య విద్య లోనే ఇదిలా ఉండగా గురు సాహితి సోదరి కేదారి శెట్టి ప్రవళిక కూడా ప్రస్తుతం విజయవాడ రైన్ భౌ మెడికల్ కళాశాలలో పీజీ ఫైనల్ చిల్డ్రన్స్ స్పెషలిస్ట్‌గా విద్యను అభ్యసిస్తుంది.నీట్ పరీక్ష ఫలితాల్లో 709లతో స్టేట్ ర్యాంకు సాధించి తన ప్రతిభను కనబరిచింది. తమ ఇద్దరు కుమార్తెలు వైద్య విద్యను అభ్యసించి గ్రామీణ పేదలకు వైద్య ఆరోగ్య సేవలు అందించాలన్న దృక్పథంతో ప్రోత్సహిస్తున్నట్టు తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఇంతటి ప్రతిభను కనబరిచిన గురు సాహితీని గ్రామానికి చెందిన ఆర్యవైశ్య కమిటీ సభ్యులు కేదారి శెట్టి గున్నాజీ, గురుమూర్తి, రమేష్, నానాజీ, అప్పారావులు అభినందించారు.



అక్కాచెల్లెలు